క్లుప్తంగా

రాజకీయ లబ్ధికే ధర్నాలు

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం

యాలాల: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ పార్టీ నాయకులు దొంగ ధర్నాలు చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం ముదిరాజ్ ఆరోపించారు. కొడంగల్ నియోజక వర్గంలోని కోస్గిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాపై ఆయన సోమవారం ఓ ప్రకటనలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపు మహిళలకు ఉచితంగా బస్సు రవాణా సౌకర్యం, రూ.2లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా లాంటి పథకాలతో ప్రజలకు దగ్గరయిందన్నారు. ఇవేవి పట్టించుకోకుండా బీఆర్ఎస్ ధర్నా అంటూ డ్రామాలాడుతుందని విమర్శించారు.

రేషన్ కార్డుల ధ్రువీకరణ ప్రక్రియ



కోకట్‌లో లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

యాలాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా మండలంలోని కోకట్ పంచాయతీలో సోమవారం ధ్రువీకరణ ఆర్ఐ సాయిచరణ్ నిర్వహించారు. ప్రజాపాలనలో భాగంగా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. కొత్త రేషన్‌కార్డులతో పాటు సభ్యత్వం, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ అనేది నిరంతరంగా ఉంటుందని, అవసరమైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

పన్నుల చెల్లింపుతో గ్రామాభివృద్ధి



తిమ్మాయిపల్లిలో పన్నులు చెల్లించిన గ్రామస్తులతో ఎంపీఓ

యాలాల: గ్రామాల్లో ఇంటి పన్ను చెల్లింపుతో పురోభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) గాలి యాదయ్య అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయిపల్లిలో ఇంటి పన్ను వసూలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇంటి పన్ను వసూలుకు గ్రామస్తులు సహకరించడం అభినందనీయమన్నారు. పన్ను చెల్లింపుతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామస్తులు చెల్లించిన ఇంటి పన్ను రసీదులను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో అధికారులు, నాయకులు

బంట్వారం: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని జాతీయ స్థాయిలో ఆడాలని కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో కోట్‌పల్లి టీం మొదటి బహుమతి కింద రూ.10వేల నగదు, కప్ గెలుచుకుంది. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులు సోమవారం కోట్‌పల్లి జెడ్పీ హై స్కూల్‌కు కప్‌ను అధికారుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, ఎంఈఓ చంద్రప్ప, టోర్నమెంట్ నిర్వాహకులు బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని మండల కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ తెలిపారు. కేశంపేట గ్రామంలోని వైఎస్సార్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఉదయం 9గంటలకు ర్యాలీని నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో మొదటిసారిగా కులగణన సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం చేయించిందన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అధికారులు లేక.. పనులు సాగక

- తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ పోస్టులు
- ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజలు
- డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ లేక పనుల్లో జాప్యం



యాలాల తహసీల్ కార్యాలయం



ఖాళీగా ఉన్న ఆర్ఐ కుర్చీ

యాలాల: ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ విభాగానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. భూముల క్రయవిక్రయాలు, అందులో తలెత్తే సమస్యలు, అసైన్డ్, పట్టా, ప్రభుత్వ తదితర భూముల రికార్డుల సమాచారమంతా రెవెన్యూ శాఖనే చూసుకుంటుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న శాఖలో ఖాళీ పోస్టులు ప్రజలను వేధిస్తున్నాయి. యాలాల మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రధాన పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రతిరోజు వివిధ రకాల పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు పూర్తి స్థాయిలో అధికారులు లేకపోవడంతో పనుల జాప్యం ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమైన పోస్టుల్లో ఉన్న అధికారులు బదిలీ కావడం లేదా ఇతర మండలాలకు డిప్యూటేషన్లపై పంపడంతో స్థానిక కార్యాలయంలో పనులకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో ఉన్న సిబ్బంది అన్ని రకాల పనులు చేస్తుండటంతో పని ఒత్తిడి పెరిగి, జాప్యానికి కారణమవుతుంది.

కొత్త వారు రాక ఇబ్బంది

తహసీల్దార్ కార్యాలయంలో ముఖ్యమైన డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న నరేష్‌గౌడ్ ఇటీవల జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు. ఎంఆర్ఐ వేణు సబ్ కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. సర్వేయర్ పోస్టుతో పాటు ఏఎస్ఓ(అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీనియర్ అసిస్టెంట్ అధికారి కొత్తగా ఏర్పడిన చౌడాపూర్ మండలానికి డిప్యూటేషపై వెళ్లారు. వీరితో పాటు కార్యాలయంలో విధులు నిర్వహించే కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు అన్ని ఖాళీగా ఉన్నాయి. దీంతో చేసేది లేక తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐ సాయిచరణ్, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ అన్ని పనులు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు ఆర్ఐలు ఉండాల్సిన మండలానికి ఒక్కరితోనే పనులు చేయిస్తున్నారు. దీంతో పనిభారంతో ఒత్తిడి అధికమవుతుంది. ఈ విషయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టి సారించి యాలాల మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన పని ఒత్తిడి



కార్యాలయంలో ముఖ్యమైన పోస్టులు ఖాళీ కావడంతో వారి పనులు సైతం చూసుకోవాల్సిన బాధ్యత మాపై పెరిగింది. కార్యాలయంలో అధికారులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో కొన్ని సార్లు పనులు ఆలస్యమవుతున్నాయి. ఎన్నికల వేళ ఈ ఖాళీలు మరింత ఆందోళన కలిగిస్తుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. త్వరలో ఖాళీ పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉంది.

– అంజయ్య, తహసీల్దార్, యాలాల

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పరిగి: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సత్యానారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాఘవపూర్‌లో రూ.8లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిందంటే తప్పకుండా తీరుస్తుందన్నారు. ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారం సంవత్సరంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘటన సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతో గ్రామాల్లోని సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జంగయ్య, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొంరాస్‌పేట: విద్యార్థులు పాఠశాల దశలోనే కలలను సాకారం చేసుకునేందుకు స్వయం పరిపాలన దినోత్సవాలు ఎంతో దోహదపడుతాయని ఉపాధ్యాయులన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన వేడుకలో జిల్లా కలెక్టర్‌గా ఝాన్సీ, డీఈఓగా తయపా, ఎంఈఓగా పల్లవి, హెచ్ఎంలుగా మశ్రత్, ఆర్తీతోపాటు ఉపాధ్యాయులుగా 56మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీహెచ్ఎం హరిలాల్, ప్రశాంత్‌కుమార్, శివరాజ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఓటరు జాబితా విడుదల



కుల్కచర్ల: నోటీసు బోర్డుపై ఓటరు లిస్టును ఏర్పాటు చేయిస్తున్న ఎంపీడీఓ

పరిగి: పరిగి మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కరీం విడుదల చేశారు. మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలకు గాను 31,202 మంది ఓటర్లుగా గుర్తించి జాబితాను ప్రదర్శించారు. 11 ఎంపీటీసీ స్థానాలు బర్కత్‌పల్లిలో 2876 మంది ఓటర్లు, మాదారంలో 3760 మంది ఓటర్లు, మిట్టకోడూర్‌లో 2699 మంది, చిట్యాలలో 3226 మంది ఓటర్లు, గడిసింగాపూర్‌లో 3819 మంది, కర్లాపూర్‌లో 2668 మంది, రూప్‌ఖాన్‌పేటలో 2508 మంది ఓటర్లు, రాపోల్‌లో 2546 మంది ఓటర్లు, సయ్యద్‌పల్లిలో 2400, నారాయణపూర్‌లో 2379, రంగంపల్లిలో 2321 మంది ఓటర్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లిస్టును పబ్లిష్ చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో...

కుల్కచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ... కుల్కచర్ల మండల పరిషత్‌లో 12 ఎంపీటీసీలుగా నిర్ధారించారన్నారు. ఇందులో 19,123 మంది పురుషులు, 19,286 మంది మహిళలు, ఇతరులు 4 కలిపి మొత్తంగా 38,413 ఓటర్లు ఉన్నారని తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అవసరమైన ఓటరు జాబితాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

నులి పురుగుల నివారణపై అవగాహన




నులి పురుగుల నివారణ జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్ సాకేత్

కొడంగల్ రూరల్: నులి పురుగుల నివారణకు కృషి చేయడంతో ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని డాక్టర్ సాకేత్ సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు నులి పురుగుల సంక్రమణ శరీరంలోకి ఏ విధంగా జరుగుతుంది, వాటి నిర్మూలన, పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కడుపులో నులి పురుగుల నివారణకు పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, మంచినీరు తాగాలని తెలిపారు. కడుపులో నులి పురుగులు పెద్దవారి కంటే చిన్నవారిలోనే ఎక్కువగా ఉంటాయని అన్నారు. పిల్లలు రోజు రోజుకు బరువు తగ్గితే, జ్వరం, తలనొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, అధ్యాపక సిబ్బంది టి.రాంబాబు, ఆర్.శ్రీనివాస్, రమేష్, డి.భరత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

భారతీయ కిసాన్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి



సమావేశంలో పాల్గొన్న భారతీయ కిసాన్ సంఘం నాయకులు

చేవెళ్ల: రైతు సమస్యలను పరిష్కరించడంలో భారతీయ కిసాన్ సంఘం ముందుంటుందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయం వద్ద సోమవారం భారతీయ కిసాన్ సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సంఘం కృషి చేస్తోందన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని తెలిపారు. రెవెన్యూ సమస్యలపై కూడా సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. ప్రతి గ్రామంలో సంఘం కమిటీలను వేసి రైతులకు అండగా ఉండాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. ప్రధానంగా రైతులకు వ్యవసాయశాఖ, విద్యుత్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటాయని వీటిని ఎప్పటికప్పుడూ గుర్తించి పరిష్కరించేందుకు సంఘం నిరంతరం పనిచేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి వీరేశం, సభ్యులు శివుడు, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విశ్వనాథం, దేవయ్య, మల్లేశ్, నర్సింహరెడ్డి, బాల్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ పదకొండవ ఓపెన్ టూ ఆల్ కబడ్డీ టోర్నమెంట్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ శివాజీ యూత్, బీజేపీ నాయకులు సోమవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని యూత్ అధ్యక్షుడు యాదగిరి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం కలుగుతుందని ఏఈ హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా పట్టణ కేంద్రంలోని అన్ని కాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుస్తుందని చెప్పారు. రంగంపల్లి ఫీడర్ పరిధిలోని రంగంపల్లి, సొండేపూర్‌తండా, రూప్‌ఖాన్‌పేట్, గడిసింగాపూర్, హీర్యానాయక్‌తండా, భోజన్యనాయక్‌తండా, మల్కాయపేటతండా, చిగురాల్‌పల్లి, మిట్టకోడూర్, లక్నాపూర్, ఇబ్రాహీంపూర్, తండా, గోవిందాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్స్ అందిస్తున్న దాతలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లికి చెందిన హంసాన్‌పల్లి వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ బి.శ్రీనివాస్‌లు విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక పాఠశాలలోని 50 విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు అందించారు. దాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయిలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

బంట్వారం: రైతులు భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏఈఓ సందీప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోట్‌పల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం మట్టి నమూనాలను సేకరిస్తామన్నారు. ఇందుకు సంబంధించి రైతులు నమూనాలను తీసుకొని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు రావాల్సిందిగా ఆయన సూచించారు. అలాగే యాసంగిలో పండించిన పంటలను కూడా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని మాజీ ఎంపీపీ అనసూయ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్‌ఖాదర్ కొంత కాలంగా అనారోగ్యంతో వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న అనసూయ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి కింద రూ.19 వేల చెక్కును మంజూరు చేయించి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత చదువులతో మంచి భవిష్యత్ పొందాలని హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ రోజు 40 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు సంబంధించిన పరీక్ష సామగ్రి అందించారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



అలంకరణలో అమ్మవారు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని రామమందిరంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ధ్వజస్తంభం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఈ మేరకు మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మహిళలు

అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం సరైంది కాదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ఒక వ్యక్తిపై కాదు.. ధర్మ పరిరక్షణపై దాడిగా భావిస్తున్నామన్నారు. ధర్మ పరిరక్షణ కోసం దేవాలయంలో ఉంటూ నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకుడిపై దాడి చేయడం సరైంది కాదన్నారు. నిందితులపై కఠిన చర్యలకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం

షాద్‌నగర్‌రూరల్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై శ్రీరామసేవ పేరుతో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడటం అమానుషమని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ అనే సూక్తితో రాజ్యపాలనను కొనసాగించిన శ్రీరామచంద్రుని సైన్యం పేరు పెట్టుకొని ప్రధాన అర్చకుడిగా ఆత్మ బోధన కార్యక్రమాలను చేపడుతున్న అర్చకుడు లక్ష్యంగా చేసుకొని దాడికి పాల్పడటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సేవలకు విశ్వ హిందూ పరిషత్ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడిపై జరిగిన దాడిని వీహెచ్‌పీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇలాంటి చర్యలను విశ్వహిందూ పరిషత్ సహించదని, దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రంగరాజన్‌కు పలువురి పరామర్శ

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని పలువురు రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. సోమవారం పలు సంఘాలు, పార్టీల నాయకులు చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, కె.వెంకటరమణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి వేర్వేరుగా వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. భగవంతుడి సేవ చేసే అర్చకుడిపై దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. అదేవిధంగా భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు వివిధ ప్రజా సంఘాల నాయకులు దాడిని తీవ్రంగా ఖండించారు.


దాడిని ఖండిస్తున్నాం

రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వీరశైవ లింగాయత్ సమాజం మండల అధ్యక్షుడు, చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. దేవుని పేరుతో సంఘ విద్రోహ శక్తులు పుట్టుకురావడం సమాజానికి హానికరమన్నారు. ఇలాంటి శక్తులను వెంటనే అణిచివేయాలన్నారు. రంగరాజన్‌పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

హిందూ సమాజంపై దాడిగా భావిస్తున్నాం: వీహెచ్‌పీ

అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని దేవాలయ వ్యవస్థపై, అర్చక వ్యవస్థపై, యావత్ హిందూ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని విశ్వ హిందూ పరిషత్ పేర్కొంది. రంగరాజన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దాడికి పాల్పడ్డ సంఘ విద్రోహ శక్తులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరింది.

వలంటీర్‌కు వేతనం అందజేత



వలంటీర్‌కు వేతనం అందిస్తున్న రాజేశ్‌పటేల్

కొందుర్గు: కొందుర్గు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో వలంటీర్‌గా పనిచేస్తున్న జ్యోతికి మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ సోమవారం వేతనం అందజేశారు. నెలకు రూ.3వేల చొప్పున 9 నెలలకుగాను రూ.27వేలు తన సొంత డబ్బులు ఆమెకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అనురాధ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం తన సొంత డబ్బులతో వలంటీర్‌ను నియమించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నయ్య, ప్రభాకర్, సచిన్, ఎలీషా, వాసూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.